క్లుప్తంగా

పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలయిక



కార్యక్రమాలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ జవహర్

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మహాత్మాజ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలో పూర్వ విద్యార్థులు సోమ వారం ఆత్మీయ కలయిక నిర్వహించారు. 1994–94 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ కలయికలో భాగంగా పాఠశాలలో రెండు రోజులుగా సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పాఠశాలకు పూర్వ విద్యార్థులు మీటింగ్ స్టేజీను నిర్మించడంతో పాటు, ఆరు కంప్యూటర్లను విరాళంగా ఇచ్చారు. స్నేహితుడు శ్రీరాములు మరణించడంతో ఆయన కుటుంబానికి రు.2లక్షలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.ఎస్.జవహర్, అమూల్య ఆసుపత్రి డాక్టర్. పాండురంగయ్య, శ్రీశైలం పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రజారోగ్యమే దేశానికి అసలైన సంపద అని గ్రామ సచివాలయ కార్యదర్శి బాలూనాయక్ అన్నారు. సోమవారం సున్నిపెంటలోని గ్రామ సచివాలయం–2లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్య, ఆరోగ్యశాఖ కమ్యూనిటీ హెల్త్ వర్కర్ రామారావు, అంగన్‌వాడీ కార్యకర్త కాశమ్మ, హౌసింగ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మి తదితరులు ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జింకా గుండయ్యయాదవ్, మండల నాయకులు ఆసాది ప్రవీణ్ దివ్యతేజ తదితరులు పాల్గొన్నారు.

'యుద్ధభేరి'కి తరలి రండి

పగిద్యాల: ఫిబ్రవరి నెలలో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఈనెల 31న విజయవాడ జింఖానా మైదానంలో నిర్వహించనున్న యుద్ధభేరి మహాసభకు వేలాదిగా తరలి రావాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు విజయుడు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక జిన్నూ కాలనీలో యుద్ధభేరి మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ కార్యకర్తలు రమేష్, నాగరత్నం, రంగస్వామి, ఉసేన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే పిల్లలకు భవిష్యత్తు

నందికొట్కూరు రూరల్ : విద్యతోనే పిల్లలకు మంచి భవిష్యత్తు ఉంటుందని గణిత ఉపాధ్యాయులు ఈశ్వరయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని వడ్డెమాను గ్రామంలోని జెడీ హైస్కూల్ విద్యార్థుల ఇంటింటికీ తిరిగి వారి విద్యా సామర్థ్యాల గురించి తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం



పనులను ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ, సర్పంచ్

నందికొట్కూరు రూరల్ : వైఎస్సార్‌సీపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని వైస్ ఎంపీపీ పబ్బతి జ్యోతి, సర్పంచ్ చెవుల సుజాత అన్నారు. సోమవారం మండల పరిధిలోని నాగటూరు గ్రామంలో రూ.40 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పరిపాలనను కొనసాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటీవ్ మెంబర్ పబ్బతి రవి, ఉప సర్పంచ్ సగినేల వృశేనయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు సుధాకరరెడ్డి పాల్గొన్నారు.

సెల్ టవర్ నిర్మాణం చేపడితే ఆమరణ దీక్ష

నందికొట్కూరు: జనావాసాల మధ్య సెల్ టవర్ నిర్మిస్తే ఆమరణ దీక్ష చేపడతానని 2వ వార్డు కౌన్సిలరు జాకీర్ హుసేన్ హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని 2వ వార్డులో సెల్ టవర్ నిర్మాణం చేపట్టే ప్రాంతంలో వార్డు ప్రజలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. మున్సిపాలిటీ అధికారులు సెల్ టవర్ నిర్మాణం తక్షణమే ఆపాలని కోరారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కిషోర్‌కు వినతి పత్రం అందజేశారు.

వెలుగోడులో కుక్కల బెడద

వెలుగోడు: పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ప్రధాన రహదారులు, వీధుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ నడుచుకుంటూ వెళ్తున్న వారిపై దాడులు చేస్తున్నాయి. ఆదివారం ఒక్క రోజే 8 మందిపై కుక్కలు దాడి చేశాయి. కుక్క కాటుకు గురైన బాధితులు పట్టణంలోని సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు. డాక్టర్ ఇక్రం అలీఖాన్ బాధితులకు ర్యాబిస్ ఇంజక్షన్లు వేసి చికిత్సలు అందిస్తున్నారు.

నైపుణ్యాలు వెలికి తీసేందుకే 'ఆడుదాం.. ఆంధ్ర'



బాలుర క్రికెట్ విన్నర్ మిడుతూరు జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్



ట్రోఫీ అందుకున్న బాలికల వాలీబాల్ విన్నర్ నందికొట్కూరు జట్టు

- హోరాహోరీగా సాగిన క్రీడా పోటీలు
- ముగిసిన నియోజకవర్గ స్థాయి క్రీడలు
- విజేతలకు ట్రోఫీ, బహుమతుల అందజేత

నందికొట్కూరు: గ్రామీణ క్రీడాకారుల్లోని నైపుణ్యాలను వెలికి తీసేందుకే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం..ఆంధ్ర పోటీలకు శ్రీకారం చుట్టారని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని గవర్నమెంట్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి ఆడుదాం..ఆంధ్ర క్రీడా పోటీలు ఆదివారం ముగిశాయి. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను ఉన్నత స్థాయిలోకి తీసుకెళ్లాలని ఉద్దేశంతోనే క్రీడా పోటీలను నిర్వహిస్తోందని చెప్పారు. మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహద పడుతాయని తెలిపారు. విజయం సాధించిన జట్లకు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి ట్రోఫీలు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ కిషోర్, కొత్తపల్లి జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, ఎంపీడీఓ జీఎస్ఎస్‌రెడ్డి, నంద్యాల, కర్నూలు జిల్లా శాప్ చైర్మన్లు రవికుమార్, శ్రీనాథ్, ఎస్ఐ హుసేన్‌బాషా, కౌన్సిలర్లు లాలు, చిన్నరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉస్మాన్‌బేగ్, ఆర్టీసీ బాబు, లోకేష్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మల్లేశ్వరరెడ్డి, రజినీకుమార్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు డోరతి, వీరన్న, జేసింత, కృష్ణ, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ స్థాయి విజేతలు..

కబడ్డీ.. : బాలుర విభాగం– మొదటి విజేతగా నందికొట్కూరు, సెకండ్ మిడుతూరు, థర్డ్ పగిడ్యాల
బాలికల విభాగం– ఫస్ట్ మిడుతూరు, సెకండ్ నందికొట్కూరు, థర్డ్ పగిడ్యాల
ఖోఖో.. : బాలురు– పగిడ్యాల, సెకండ్ మిడుతూరు, థర్డ్ జూపాడుబంగ్లా
బాలికలు– జూపాడుబంగ్లా ఒకటి టీమ్ మాత్రమే వచ్చింది.
వాలీబాల్ : బాలురు– మొదటి స్థానం నందికొట్కూరు, రెండోవ స్థానం కొత్తపల్లి, మూడోవ స్థానం జూపాడుబంగ్లా
బాలికలు– ఫస్ట్ పగిడ్యాల, సెకండ్ నందికొట్కూరు, థర్డ్ జూపాడుబంగ్లా
షటిల్ బ్యాడ్మింటన్ :
బాలురు– ఫస్ట్ నందికొట్కూరు, సెకండ్ జూపాడుబంగ్లా, థర్డ్ పాములపాడు
బాలికలు – ఫస్ట్ నందికొట్కూరు, సెకండ్ జూపాడుబంగ్లా, థర్డ్ పగిడ్యాల
క్రికెట్ ..
బాలుర విభాగం– ఫస్ట్ మిడుతూరు, సెకండ్ పగిడ్యాల, థర్డ్ కొత్తపల్లి
బాలికల విభాగంలో ఎంపిక కాలేదు.

జగనన్నతోనే సామాజిక న్యాయం



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులతో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

- సార్వత్రిక ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సిద్ధం కావాలి
- శాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి
- టీడీపీ నుంచి 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

నందికొట్కూరు: ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక న్యాయం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమైందని శాప్ రాష్ట్ర చైర్మన్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని 11 వార్డుకు చెందిన టీడీపీ నాయకులు రహంతుల్లా, ఆయూబ్ ఆధ్వర్యంలో కార్పెంటర్ శాలు, బాషా, మాబు, రాజు, వలి, చిన్నరాజు, హుసేన్‌నాలం, యూసూఫ్, మౌలానాతో పాటు 30 కుటుంబాలు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. వారికి సిద్ధార్థరెడ్డి పార్టీ కండువా కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ పాలనలో వెనుకబడిన వర్గాలను చంద్రబాబు విస్మరించారని గుర్తు చేశారు. పేదలకు మేలు చేసే ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమేనని చెప్పారు. టీడీపీ కల్లబొల్లి మాటలు ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తిప్పికొట్టాలని చెప్పారు. రాబోయే సార్వత్రిక ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకరరెడ్డి, కౌన్సిలర్లు హమీద్, చాంద్ బాషా, నాయబ్, కృష్ణ, లాలు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మన్సూర్, నాయకులు ఉస్మాన్‌బేగ్, అబుబక్కర్, ఆర్టీసీ బాబు, అబ్దుల్లా, రామకృష్ణ, శాలు, రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలను మోసం చేసిన ఘనత చంద్రబాబుదే



సీఎం వైఎస్ జగనన్న చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న పొదుపు మహిళలు

నందికొట్కూరు: పొదుపు మహిళలను రుణ మాఫీ పేరుతో మోసం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని కేవీఆర్ ఫంక్షన్ హాల్‌లో 2, 3, 4, 5, 6, 7, 24, 25వ వార్డులకు చెందిన 177 పొదుపు సంఘాలకు నాల్గవ విడత వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించారు. సీఎం వైఎస్ జగనన్న చిత్ర పటానికి పొదుపు మహిళలతో కలిసి పాలాభిషేకం చేశారు. పొదుపు మహిళలు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. పొదుపు మహిళలకు వైఎస్సార్ ఆసరా మెగా చెక్కును చైర్మన్ అందజేశారు. మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ, చేయూత వంటి సంక్షేమ పథకాలు పేద మహిళలకు ఆర్థిక స్వావలంబనతో పాటు కుటుంబాన్ని ఆర్థిక ప్రగతి నడిపిస్తున్నాయన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం నాల్గవ విడత కింద 177 పొదుపు సంఘాలకు రూ. 95,55,378 లబ్ధి చేకూరిందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిషోర్, వైస్ చైర్మన్ ప్రశాంతి, కౌన్సిలర్లు సువర్ణమ్మ, కృష్ణ, లాలు, మెప్మా సీఎంఎం శాంతకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆర్ట్ శ్రీను, శేఖర్, రాజు, అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సరిహద్దు చెక్‌పోస్టు తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన జిల్లా సరిహద్దు చెక్‌పోస్టును ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసులు సోమవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్ఐ నాగార్జున, పోలీసు సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇతర జిల్లాల నుంచి మద్యం, డబ్బు అక్రమ రవాణాను అరికట్టేందుకు చెక్‌పోస్టును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇతర జిల్లాల నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని పోలీసు సిబ్బంది క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఏదైనా అనుమానాస్పదంగా ఉంటే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు.

అప్పు ఇవ్వలేదని గొడ్డలితో దాడి

మహానంది: అప్పుగా డబ్బు అడిగితే ఇవ్వలేదని ఓ వ్యక్తిపై గొడ్డలితో దాడి చేసిన ఘటన మండలంలోని గాజులపల్లె గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాల మేరకు..గ్రామానికి చెందిన మహేష్‌ను ఆదే గ్రామానికి చెందిన శ్రీనివాసులు డబ్బు అప్పుగా అడిగాడు. తన వద్ద లేవని చెప్పడంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో శ్రీనివాసులు గొడ్డలితో మహేష్‌పై దాడి చేయడంతో గాయపడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మహానందీశ్వరుడికి పల్లకీసేవ

మహానంది: మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి పల్లకీ సేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు, పండితులు మహానందీశ్వర స్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. పల్లకీలో కొలువైన స్వామి, అమ్మవార్లకు గణపతి పూజ, పుణ్యాహావాచనం, హారతిపూజలు, అలంకార, ఉత్సవ పూజలు నిర్వహించారు. బలిహరణ పూజలు చేసిన అనంతరం ఆలయ ప్రాకారాల్లో స్వామివార్ల ఉత్సవం వైభవంగా జరిగింది.

వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలి

కొత్తపల్లి: గ్రామాలలో ప్రజలకు సేవలందిస్తున్న గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నగేష్, ప్రధాన కార్యదర్శి భూపాల్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి స్వాములు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని గ్రామ రెవెన్యూ సహాయకులతో కలసి ర్యాలీ చేపట్టారు. గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షుడు రవి, వీఆర్ఏలు సలాం, మియాసావ్, అమ్మని, మూర్తుజ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'ను సద్వినియోగం చేసుకోండి

కొత్తపల్లి: గ్రామాల్లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ మేరి సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు అన్ని గ్రామాలలో నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగానే గువ్వలకుంట్ల గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో రెండో విడత ఆరోగ్య సురక్ష క్యాంపును మంగళవారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల ప్రజలు ఈ క్యాంపును సద్వినియోగం చేసుకొని ఆరోగ్య సేవలు అందుకోవాలని సూచించారు.

ప్రతి అర్జీని పరిష్కరిస్తాం

కొత్తపల్లి: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరించేందుకు కోసం కృషి చేస్తామని తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని దుద్యాల, లింగాపురం, పెద్దగుమ్మడాపురం నుంచి రైతులు వారి పొలం సర్వే కోసం అర్జీలు ఇచ్చారన్నారు.

సద్వినియోగం చేసుకోండి

జూపాడుబంగ్లా: ప్రతి సోమవారం తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. సోమవారం తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి, ప్రజల నుంచి సమస్యలపై అర్జీలు స్వీకరించారు.

వాణిజ్య పంటల సాగుతో లాభాలు

మహానంది: వాణిజ్య పంటల సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి బి.నాగేశ్వరరెడ్డి తెలిపారు. ఎంసీ ఫారం గ్రామానికి చెందిన పృధ్వీరాజ్‌కుమార్‌రెడ్డి సాగు చేస్తున్న పొగాకు పంటను సోమవారం పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ రబీలో మహానంది మండలంలో 50 హెక్టార్లలో సాగవుతుందన్నారు. పంట దిగుబడులు ఆశించిన మేరకు పది నుంచి పన్నెండు క్వింటాళ్లు వస్తుందని, మార్కెట్‌లో ధర బాగుండటంతో అన్ని పెట్టుబడులు పోగా ఎకరాకు రూ. 1.60లక్షల వరకు మిగిలే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వీహెచ్ఏ హరిత, ఎంపీఈఓ ఇంద్రాణి, రైతులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా తహసీల్దార్ బదిలీ

జూపాడుబంగ్లా: మండల తహసీల్దార్ పుల్లయ్య యాదవ్ బదిలీ అయ్యారు. సోమవారం ఆత్మకూరు ఆర్డీఓ ఎం దాసు ఆయనను రిలీవ్‌చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్‌ను నియమించారు. తహసీల్దార్‌గా రెండేళ్ల శిక్షణ కాలం ముగియటంతో జూపాడుబంగ్లా తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న పుల్లయ్యయాదవ్ అతని మాతృకార్యాలయం భూపరిపాలన కమిషనర్ కార్యాలయం మంగళగిరి(సీసీఎల్ఏ)కు బదిలీ అయ్యారు. త్వరలో రెగ్యులర్ తహసీల్దార్ నియమించే అవకాశాలున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

రుద్రకోడుకు అనుమతించలేదని శివస్వాముల ధర్నా



రోడ్డుపై బైటాయించిన శివస్వాములు

ఆత్మకూరురూరల్: నల్లమల అడవుల్లో వెలసిన రుద్రకోటీశ్వర స్వామి దర్శనం కోసం వెళ్తున్న శివ స్వాములను అడ్డుకున్నారంటూ శివస్వాములు సోమవారం మండల పరిధిలోని నల్లకాల్వ గ్రామంలో ఆత్మకూరు – నంద్యాల ప్రధాన రహదారిపై రాకపోకలను స్తంభింపజేస్తూ ధర్నాకు దిగారు. రుద్రకోడుకు అటవీశాఖ వారు ఆదివారం, సోమవారం మాత్రమే భక్తులను అనుమతించే వారు. అయితే స్వాములు ద్విచక్రవాహనాల్లో రావడంతో, అనుమతి లేదని ఏదైనా కారులాంటి వాహనంలో వస్తే వాహనానికి రూ.300 చొప్పున టోకెన్ తీసుకోవాలని అటవీ అధికారులు సూచించారు. అయితే హఠాత్తుగా ఎవరికి చెప్పకుండా ప్రచారం చేయకుండా కొత్త నిబంధనలు పెడితే ఎలా అని శివస్వాములు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసి.. రహదారిపై బైటాయించారు. దీంతో బైర్లూటి రేంజర్ సుభాష్, పోలీసులు అక్కడికి వచ్చి శివస్వాములతో మాట్లాడారు. మార్చి 10వ తేదీ వరకు ఉచితంగా స్వామి దర్శనానికి అనుమతిస్తామని చెప్పడంతో స్వాములు తమ నిరసనను విరమించి రుద్రకోటీశ్వర దర్శనానికి కదలి వెళ్లారు.

ఎన్‌టీసీఏ నిబంధనలు పాటించాలి

జాతీయ పులుల సంరక్షణా ప్రాధికార సంస్థ (ఎన్‌టీసీఏ) ఇచ్చిన గైడ్ లైన్స్ ప్రకారం నడుచుకోవాలని బైర్లూటి ఎఫ్ఆర్‌వో సుభాష్ తెలిపారు. చట్టం ప్రకారం పులుల అభయారణ్యంలో వాహనాల సంచారం నిషేధమని, కానీ రుద్రకోటీశ్వర క్షేత్రానికి వచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని ఆది, సోమవారాల్లో మాత్రమే క్షేత్రదర్శనానికి అనుమతినిచ్చారని చెప్పారు. నల్లమలలో ప్లాస్టిక్‌ను నిషేధించడంతో భక్తులు ఎలాంటి ప్లాస్టిక్ సాచెట్‌లను తీసుకు వెళ్లకూడదని సూచించారు. భక్తుల విన్నపం మేరకు శివరాత్రి వరకు ఉచితంగా క్షేత్రానికి అనుమతిస్తామన్నారు. ఎన్‌టీసీఏ నిబంధనల ప్రకారం శివరాత్రి తరువాత తప్పనిసరిగా క్లోజ్డ్ డోర్స్ ఉన్న వాహనంలో రూ.300 రుసుం చెల్లించి మాత్రమే అదికూడా ఆది, సోమవారాల్లో మాత్రమే వెళ్లాలని తెలిపారు. అటవీశాఖ నిబంధనలను అందరూ అర్థం చేసుకోవాలని కోరారు.

గోసంరక్షణ పథకానికి రూ.5 లక్షలు విరాళం



దేవస్థానం పీఆర్‌ఓకు రూ. 5లక్షల విరాళం చెక్కును అందజేస్తున్న దాతలు

శ్రీశైలం: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న గో సంరక్షణ పథకానికి సికింద్రాబాదుకు చెందిన రాణి కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్, గల్లా గుండయ్య రూ.5 లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు సోమవారం కుటుంబసభ్యులతో కలసి దేవస్థానం ప్రజాసంబంధాల అధికారి టి. శ్రీనివాసరావుకు చెక్కు అందజేయగా, వారు దాతలకు శ్రీస్వామి అమ్మవార్ల శేషవస్త్రాలు, అడ్డుప్రసాదాలను బహూకరించారు. అలాగే గో సంరక్షణశాలకు రూ.1,00,116లను చెన్నైకి చెందిన ఎల్.రమేష్ రెడ్డి విరాళంగా ఇచ్చారు.

అన్నదాన పథకానికి విరాళాలు

దేవస్థానం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన రామకృష్ణ దంపతులు రూ.100,116, ఖమ్మం జిల్లాకు చెందిన శ్రీ పర్వతనేని వీవీఎస్ఎస్ శివరామకృష్ణ దంపతులు రూ.1,00,116, రంగారెడ్డి జిల్లా మారేడుపల్లికి చెందిన నందీశ్వరరెడ్డి 1,11,116లను సోమవారం విరాళాల కేంద్రంలో పర్యవేక్షకులు నాగరాజుకు అందజేశారు.

అట్రాసిటీ చట్టంపై అవగాహన ఉండాలి



చట్టాలను వివరిస్తున్న డీఎస్పీ లక్ష్మీనారాయణ

శ్రీశైలంప్రాజెక్ట్: షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెలగలకు చెందిన దళితులు, గిరిజనులు అట్రాసిటీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని క్రైం ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం శ్రీశైలం ఐటీడీఏ ప్రాంగణంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో చెంచుగిరిజనులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఎస్సీ, ఎస్టీల పట్ల ఎవరైనా చిన్నచూపు చూసినా, దాడిచేసినా, దూషించిన, ఆస్తుల ధ్వంశానికి పాల్పడినా ఈ ప్రివెన్షియల్ యాక్ట్ రక్షణ కవచంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో గిరిజనులు, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్.బి.రవీంద్రారెడ్డి, సీఐడీ ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు, ఎస్ఐ ఉస్మాన్ గని, టూటౌన్ ఎస్ఐ గంగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాన్ని దుర్వినియోగం చేయరాదు

ఆత్మకూరురూరల్: సమాజంలో అణగారిన జాతుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టడం కోసమే ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని రాజ్యాంగం మనకు అందించిందని, దాన్ని దుర్వినియోగం చేయకుండా ఆత్మరక్షణకు వినియోగించుకోవాలని ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం ఆత్మకూరు అటవీ డివిజన్‌లోని బైర్లూటి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అట్రాసిటీ చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ గురవమ్మ, ప్రిన్సిపాల్ రేఖామణి, హెచ్ఎం ఏసు యాదవ్, ఆత్మకూరు సీఐ నాగభూషణ్, సీఐడీ ఇన్‌స్పెక్టర్ నగేష్‌బాబు పాల్గొన్నారు.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పరిశీలన



అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కాలువను పరిశీలిస్తున్న ధర్మకర్తల మండలి చైర్మన్

శ్రీశైలం: శ్రీశైలక్షేత్ర పరిధిలోని కోట్లాది వ్యయంతో నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ట్రస్టు బోర్డు చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి సోమవారం ఇంజినీరింగ్, శానిటేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. అన్నదానం, లడ్డూపోటు, మల్లికార్జునసదన్, టూరిస్ట్ బస్టాండ్ తదితర ప్రదేశాల్లో పర్యటించారు. ఎప్పటికప్పుడు చెత్తా చెదారాలను తొలగిస్తుండాలని, ముఖ్యంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు బ్లాక్ అయితే వెంటనే మరమ్మతులు చేసి అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. అలాగే క్షేత్ర వ్యాప్తంగా పలుచోట్ల డివైడర్లకు రంగులు వేయాలని సూచించారు. ఈఈ మురళీధరరెడ్డి, డీఈ చంద్రశేఖర్ శాస్త్రి, పర్యవేక్షకులు అయ్యన్న, అసిస్టెంట్ ఇంజనీర్లు భవన్, రంగప్రసాద్ తదితరులు ఉన్నారు.

వైద్యశాలకు బీసీ అనలైజర్, మందుల విరాళం



వైద్యశాలలో బయోకెమిస్ట్రీ అనలైజర్ మిషన్, మందులు అందజేస్తున్న దాతలు

శ్రీశైలం: శ్రీశైల దేవస్థానం భక్తులు, స్థానికుల కోసం ఏర్పాటు వేసిన ఉచిత వైద్యశాలకు సోమవారం సికింద్రాబాదుకు చెందిన రాణి కన్‌స్ట్రక్షన్ ప్రైవేటు లిమిటెడ్ గల్లా గుండయ్య కుటుంబ సభ్యులతో కలిసి బయోకెమిస్ట్రీ అనలైజర్ మిషన్ (బీసీ అనలైజర్ మిషన్)తో పాటు పలురకాల మందులను విరాళంగా అందజేశారు. దేవస్థానం సహాయ కార్యనిర్వహణాధికారి ఐఎన్‌వీ మోహన్, ప్రజాసంబంధాల అధికారి టి.శ్రీనివాసరావులకు వీటిని అందజేశారు. ఈమిషన్ ద్వారా కిడ్నీ, షుగర్, కొలస్ట్రాల్, కామెర్లు, ఎలక్ట్రోలైట్స్ తదితర రక్త పరీక్షలు నిర్వహించడానికి వీలు పడుతుందని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్లు సూర్య, బాలాజీ, ల్యాబ్ టెక్నీషియన్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారిఫ్

ఆత్మకూరు: మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని, పట్టణంలో సీసీ రోడ్లు, వీధి దీపాలు, పార్కులు, డ్రైనేజీలు ఏర్పాటుకు పెద్దపీట వేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియా మారిఫ్ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇప్పటికే పలు కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేస్తున్నామని, కర్నూలు–గుంటూరు ప్రధాన రహదారిలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి నూతన ఎల్ఈడీ బల్బులను బిగించి పట్టణ రూపురేఖలు మారుస్తామని చెప్పారు. ఆత్మకూరు పట్టణంలో అభివృద్ధిపై ఈ ఏడాది రూ. 17,03,67,500తో ప్రతిపాదనలు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా బడ్జెట్‌ను ఆమోదించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, వార్డు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

కుక్కలు, దోమల బెడద నుంచి కాపాడండి

ఆత్మకూరు: పట్టణంలోని ప్రజలను కుక్కలు, దోమల బెడద నుంచి రక్షణ కల్పించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి రణధీర్, ఇస్మాయిల్, సురేంద్ర కోరారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పట్టణంలో ప్రతి నెల పదుల సంఖ్యలో కుక్కల బారిన పడి గాయాల పాలవుతున్నారన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పలుమార్లు ఈ విషయంపై చర్చించినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో దినేష్, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు పోలీస్ స్టేషన్ అప్‌గ్రేడ్

ఆత్మకూరురూరల్: ఎన్నాళ్లుగానో ఎదురు చూస్తున్న ఆత్మకూరు పోలీస్ స్టేషన్ ఉన్నతీకరణ పూర్తి అయినట్లు తెలిసింది. ఇకపై స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్ఓ) ఉండి ఇరువురు ఎస్ఐలు సహాయకులుగా ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. లక్ష్మీనారాయణను ఆత్మకూరు అర్బన్ పోలీస్ స్టేషన్‌కు ఎస్‌హెచ్ఓగా నియమించినట్లుగా సమాచారం. ఇకపై ఆత్మకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రూరల్ సీఐగా పిలవబడనున్నారు.

వెలుగోడులో 41,739 మంది ఓటర్లు

వెలుగోడు: మండలంలో 41,739 మంది ఓటర్లు ఉన్నట్లు తహసీల్దార్ నారాయణరెడ్డి తెలిపారు. ఇందులో 20,357 మంది పురుషులు, 21,379 మంది స్త్రీలు ఉన్నట్లు వెల్లడించారు. పురుషుల కంటే మహిళా ఓటర్లు 1,022 మంది ఎక్కువగా ఉన్నట్లు చెప్పారు. గత ఎన్నికల్లో 41,030 ఓటర్లు ఉండగా ఈసారి 739 మంది కొత్త ఓటర్లు కొత్తగా నమోదయ్యారని తెలిపారు. వచ్చే ఎన్నికలకు మండలంలో 47 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

రహదారి నిబంధనలు పాటించాలి

పాములపాడు: వాహనచోదకులు ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు పాటించాలని ఎస్ఐ అశోక్ సూచించారు. సోమవారం స్థానిక పోలీసు స్టేషన్, జూటూరు గ్రామ సమీపంలో కేజీ రోడ్డు పై వాహనాల తనిఖీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు కెపాసిటీకి మించి ప్రయాణికులను ఎక్కించరాదని సూచించారు. నెమ్మదిగా, జాగ్రత్తగా నడుపుతూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు.